## క్లుప్తంగా

### హైవేపై చలివేంద్రం ఏర్పాటు



నడింపాలెం (ప్రత్తిపాడు): మండల పరిధిలోని నడింపాలెం పదహారవ నంబరు జాతీయ రహదారిపై మెస్సర్స్ పోలిశెట్టి సోమసుందరం అండ్ శ్రీ రాజరాజేశ్వరి చారిటబుల్ ట్రస్టు సహకారంతో గురువారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుత ఎండల తీవ్రత కూడా అధికంగా ఉండటంతో ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. వేసవి కాలం ముగిసే వరకు కొనసాగిస్తామని చెప్పారు.

### చిన్నారులకు వినికిడి యంత్రాలు, ట్రై సైకిళ్ల పంపిణీ



కాకుమాను: విభిన్న ప్రతిభావంతులకు సానుభూతి కాకుండా సహాయ సహకారాలు అందించాలని ఎంఈఓ కెఎఫ్.కెనడీ తెలిపారు. స్థానిక భవిత కేంద్రంలో గురువారం విభిన్న ప్రతిభావంతులకు వినికిడి యంత్రాలు, ట్రై సైకిళ్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కెనడీ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల్ని తల్లిదండ్రులు తక్కువగా చూడకుండా వారిలో మనోధైర్యాన్ని నింపి ఎంచుకున్న రంగాల్లో రాణించే విధంగా ప్రోత్సహించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఐఈఆర్టీ టీచర్ దయమ్మ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### విజ్ఞాన్ యూనివర్సిటీ అధ్యాపకురాలికి పీహెచ్‌డీ



చేబ్రోలు: విజ్ఞాన్ యూనివర్సిటీలోని అడ్వాన్స్‌డ్ కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ జోత్స్నాదేవి బోడపాటికి తమ యూనివర్సిటీ సీఎస్ఈ విభాగం గురువారం పీహెచ్‌డీ పట్టా అందించిందని వీసీ పి. నాగభూషణ్ తెలిపారు. ''జాయింట్ ఆప్టిమైజేషన్ ఆఫ్ లేబుల్ గైడెడ్ ఆటో ఎన్‌కోడర్ విత్ అటెన్షన్ బేస్డ్ క్లాసిఫైర్ ఫర్ మెడికల్ ఇమేజ్ అనాలసిస్'' అనే అంశంపై ఆమె పరిశోధన చేశారని పేర్కొన్నారు. తన పరిశోధనలో భాగంగా జోత్స్నాదేవి ఐదు ఎస్‌సీఐ, ఒక ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ పేపర్లు పబ్లిష్ చేశారని తెలిపారు. ప్రొఫెసర్ జోత్స్నాదేవి బోడపాటిని పలువురు అభినందించారు.

### పెదనందిపాడు కళాశాల అభివృద్ధికి విరాళం



పెదనందిపాడు: స్థానిక ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ డి.ఈశ్వరరావు కళాశాల అభివృద్ధికి గానూ పాలకవర్గానికి గురువారం రూ.50 వేలను అందించారు. ఆయన కళాశాలలో 1984 నుంచి 30 సంవత్సరాలు ఇంగ్లిష్ లెక్చరర్‌గా, ఎన్‌సీసీ ఇన్‌చార్జిగా, హెచ్ఓడీగా, ప్రిన్సిపాల్‌గా పని చేసి పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా కళాశాల పాలకవర్గ ట్రెజరర్ లావు ఆదిశేషయ్య, కమిటీ సభ్యుడు నర్రా బాలకృష్ణ, అధ్యాపకులు ఆయన్ను సన్మానించారు. కళాశాల అభివృద్ధికి ఈశ్వరరావు ఎంతో కృషి చేశారని కొనియాడారు. కళాశాలతో ఉన్న అనుబంధం తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని ఈశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వీరారాఘవయ్య, పీడీ పి.శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

### భగీరథ మహర్షి జయంతి వేడుకలు



పెదకాకాని: సగరుల ఆరాధ్యదైవం భగీరథ మహర్షి జయంతి వేడుకల్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పెదకాకానిలోని సగరపాలెం రామాలయంలో గురువారం మహర్షి విగ్రహాన్ని పూలమాలలతో అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. భగీరథ మహర్షి తపస్సు, చరిత్రను మననం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ పెద్దలు దూపాటి వెంకట్రావు, కర్నాటి వెంకటేశ్వరరావు, ముద్రబోయిన మహంకాళీరావు, కలవకొల్లు ఆదినారాయణ, దూపాటి శాంతి, బాబీ, గజ్జెల విజయలక్ష్మి పాల్గొన్నారు.

# జగన్ పాలనలో సొంతింటి కల సాకారం

- ఎమ్మెల్యే మేకతోటి సుచరిత
- 27వ డివిజన్ నల్లపాడులో ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీ



లబ్ధిదారులకు స్థలాల పట్టాలను అందజేస్తున్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత తదితరులు

గుంటూరు రూరల్: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల స్థలాల్ని అందించి వారి సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేశారని ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పేర్కొన్నారు. 27వ డివిజన్ నల్లపాడులో గురువారం పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా మహానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా జగనన్న ప్రభుత్వంలో రాష్ట్రంలో 31 లక్షల మంది పేదలకు ఇళ్ల స్థలాల్ని పంపిణీ చేసినట్లు చెప్పారు. పేదలకు కేటాయించిన స్థలాల్లో జగనన్న కాలనీలు రూపుదిద్దుకుంటున్నాయని తెలిపారు. ఆంధ్రరాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా నేడు సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ అందుతున్నాయన్నారు. గ్రామ సచివాలయం వ్యవస్థ ద్వారా వలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుని వాటికి పరిష్కారాల్ని అక్కడే చేయిస్తున్నారని వివరించారు. ప్రతి ఇంటికీ నవరత్న పథకాలు అందుతున్నాయంటే ప్రజల అభ్యున్నతికి జగనన్న ఏ విధంగా కృషి చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చని తెలిపారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు జన్మభూమి కమిటీల్ని ఏర్పాటు చేసి కేవలం ఒక వర్గానికి మాత్రమే లబ్ధి చేకూరేలా చేశాడన్నారు. అధికారులు, జన్మభూమి కమిటీల చుట్టూ తిరిగినా అప్పటికి సమస్య పరిష్కారం అయ్యేది కాదని తెలిపారు. నేడు వలంటీర్లు, సచివాలయం ఉద్యోగులు ప్రజల ఇళ్ల వద్దకే వచ్చి వారి సమస్యల్ని పరిష్కరిస్తున్నారని చెప్పారు. గతంలో ప్రభుత్వ స్థలాలు యుద్ధాలు చేస్తే వచ్చేవని, కానీ నేడు జగనన్న కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి ప్రైవేటు భూముల్ని సైతం కొనుగోలు చేసి పేదలకు అందజేస్తున్నారని వివరించారు. ఒక్క నల్లపాడు గ్రామంలోనే 1100 మందికి స్థలాలు అందజేశామంటే పేదలపై జగనన్న ప్రభుత్వానికి ఉన్న శ్రద్ధ ఊహించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు చల్లా రాజ్యలక్ష్మి, స్మితపద్మజ, వైస్ ఎంపీపీ ఇంటూరి పద్మావతి, చల్లావారిపాలెం సర్పంచ్ ఆరుదల సాంబశివరావు, ఆర్ అండ్ బీ డైరెక్టర్ పిల్లి మేరి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు మెట్టు వెంకటప్పారెడ్డి, నడవా వీరయ్య, తంగెళ్ల నాగేశ్వరరావు, కిశోర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# అన్ని వర్గాల అభ్యున్నతి జగనన్నతోనే సాధ్యం



మా నమ్మకం నువ్వే జగన్ కర పత్రాలను మహిళలకు పంపిణీ చేస్తున్న శివరామకృష్ణ,తదితరులు

కాకుమాను: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి జగనన్న పాలనలోనే సాధ్యమవుతుందని వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ నల్లమోతు శివరామకృష్ణ తెలిపారు. కాకుమాను సచివాలయం-2 పరిధిలోని ఎస్టీ కాలనీలో గురువారం రాత్రి 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శివరామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రజాపాలన సాగిస్తున్న దేశ చరిత్రలో ఏకైక నాయకుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. కులాలు, మతాలు, ప్రాంతాలు చూడకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తూ ప్రజల మన్ననలు పొందుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న మంచి మనసున్న నాయకుడని కొనియాడారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి గత నాలుగు సంవత్సరాల నుంచి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పసుపులేటి శివకుమారి, సచివాలయ మండల కన్వీనర్ పంగులూరి శ్రీనివాసరావు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

# డ్వాక్రా గ్రూపు సభ్యుల నగదు రికవరీ



వివరాలు తెలుపుతున్న ఏపీఎం సోమశేఖర్

గరికపాడు(కాకుమాను): పలు డ్వాక్రా గ్రూపుల బ్యాంకు ఖాతాల నుంచి యానిమేటర్ వ్యక్తిగత ఖర్చులకు డ్రా చేసి ఉపయోగించుకున్న నగదును రికవరీ చేసినట్లు వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం సోమశేఖర్ తెలిపారు. మండలంలోని గరికపాడులోని మేరీమాత, ప్రశాంతి గ్రూపుల నుంచి యానిమేటర్ రూ.3.50లక్షలు డ్రా చేసి వాడుకున్న విషయం గత కొద్ది రోజుల కిందట బయట పడడంతో గ్రూపు సభ్యులు విషయాన్ని స్త్రీ నిధి మేనేజర్ అమరావతి దృష్టికి తీసుకువెళ్లారు. గురువారం ఆమె గ్రూపు సభ్యులు, యానిమేటర్ శ్యామలతో విచారణ చేపట్టింది. ఖర్చుల నిమిత్తం వాడుకున్న విషయం వాస్తవమేనని యానిమేటర్ ఒప్పుకోవడంతో వెంటనే ఆమె నుంచి రూ.3.50 లక్షలను రకవరీ చేసినట్లు స్త్రీ నిధి మేనేజర్ అమరావతి తెలిపారు. గ్రూపు సభ్యుల అనుమతి లేకుండా నగదు డ్రా చేయడం నేరమని, భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు జరగకుండా చూడాలని ఏపీఎం సోమశేఖర్‌కు, యానిమేటర్ శ్యామలకు సూచించారు. కార్యక్రమంలో లీగల్ కాంపోనెంట్(ఎల్‌సీ) గురుప్రసాద్, సీసీలు రాఘవ, సుబ్బారావు పాల్గొన్నారు.

# ప్రతి పంచాయతీలో ఉపాధి పనులు లక్ష్యం



పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ యుగంధర్

ప్రత్తిపాడు: ప్రతి గ్రామ పంచాయతీలోనూ ఉపాధి పనులు ముమ్మరంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీ యుగంధర్ చెప్పారు. ప్రత్తిపాడు పంచాయతీ పరిధిలోని రావిపాటివారిపాలెంలో పనుల్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పనులకు హాజరైన కూలీలు, మస్టర్ వివరాలను ఫీల్డ్ అసిస్టెంట్లను అడిగి తెలుసుకున్నారు. నిర్ణీత కొలతల ప్రకారం కూలి చెల్లిస్తున్నారా ? అంటూ కూలీల నుంచి ఆరా తీశారు. ఈ సందర్భంగా పీడీ యుగంధర్ మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన కొలతల ప్రకారం పనులు చేస్తే రోజుకు కూలీగా రూ. 272 ఇవ్వనున్నట్లు చెప్పారు. ప్రస్తుతం వేసవిలో ఉదయం ఆరు గంటలకే పనులకు వచ్చి తొమ్మిది గంటలకు వెళ్లేలా ప్రణాళికాబద్ధంగా ప్లాన్ చేసుకుంటే ఎండబారిన పడకుండా ఉండవచ్చని సూచించారు. పనులకు కూలీలు ఎక్కువ మంది వచ్చేలా ఫీల్డ్ అసిస్టెంట్లు, సీనియర్ మేట్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# ఆర్టీసీ బస్సు ఢీకొని మెడికల్ షాప్ యజమాని దుర్మరణం



ప్రమాద స్థలంలో ప్రతాప్‌కుమార్ మృతదేహం

ప్రత్తిపాడు: రోడ్డు ప్రమాదంలో మెడికల్ షాప్ యజమాని దుర్మరణం చెందిన ఘటన వట్టిచెరుకూరు మండల పరిధిలో చోటు చేసుకుంది. పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం ఉన్నవ గ్రామానికి చెందిన కుర్రా ప్రతాప్‌కుమార్ (42) గుంటూరు జిల్లా ప్రత్తిపాడులో మెడికల్ దుకాణం నిర్వహిస్తున్నాడు. షాపులోకి కావాల్సిన సరుకులు తెచ్చుకునేందుకు గురువారం మధ్యాహ్నం గుంటూరుకు వెళ్లాడు. సరుకు తీసుకుని తిరిగి ప్రత్తిపాడుకు స్కూటీపై వస్తున్నారు. ఈ సమయంలో గుంటూరు-పర్చూరు పాత మద్రాసు రోడ్డుపై వట్టిచెరుకూరు మండలం కుర్నూతల సమీపంలో ప్రత్తిపాడు వైపు నుంచి గుంటూరు వెళుతున్న ఆర్టీసీ ఆర్డినరీ బస్సు స్కూటీని ఢీకొట్టింది. దీంతో ప్రతాప్‌కుమార్ తీవ్ర గాయాలపాలై రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. హెల్మెట్ ఉన్నప్పటికీ ప్రాణాపాయం తప్పలేదు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు వట్టిచెరుకూరు ఎస్ఐ కలగయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు.

**రోడ్డు ప్రమాదంలో మిర్చి యార్డు కూలీ మృతి**



వెంకటేశ్వర్లు మృతదేహం

గుంటూరు రూరల్: రోడ్డు పక్కన నిలిపిఉన్న లారీని ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రత్తిపాడు మండలం యనమదల గ్రామానికి చెందిన పోతంశెట్టి వెంకటేశ్వర్లు(55) గుంటూరు మిర్చి యార్డులో కూలీ పనులు చేసుకుని జీవిస్తుంటాడు. బుధవారం రాత్రి పనులు ముగించుకుని ఇంటికి తిరిగి వెళుతూ ఉండగా పొత్తూరు సమీపంలో రోడ్డు పక్కన నిలిపి ఉన్న లారీని ద్విచక్ర వాహనంతో వెనుక నుంచి ఢీకొన్నాడు. ప్రమాదంలో తీవ్ర గాయాలతో వెంకటేశ్వర్లు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. బంధువులకు సమాచారం అందించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

పెదకాకాని: భార్యాభర్తలు బైక్‌పై వెళుతుండగా వెనుక కూర్చున్న భార్య మెడలో బంగారు గొలుసు చోరీ చేసిన సంఘటన ఉప్పలపాడు, తక్కెళ్లపాడు గ్రామాల మధ్య జరిగింది. మండలంలోని ఉప్పలపాడు గ్రామానికి చెందిన పల్లెంపాటి శ్రీనివాసరావు, శివపార్వతి ప్రతిరోజూ గ్రామంలో పాలు సేకరించి గుంటూరు నగరంలో ఇళ్లకు పోస్తుంటారు. ఎప్పటి మాదిరిగానే బుధవారం రాత్రి దంపతులిద్దరూ గ్రామంలో పాలు సేకరించి ద్విచక్ర వాహనంపై గుంటూరు బయలు దేరారు. మార్గం మధ్యలో తక్కెళ్లపాడు సిబార్ దంత వైద్య కళాశాల సమీపంలోకి చేరుకునే సరికి వెనుక నుంచి బైక్‌పై వచ్చిన ఇద్దరు గుర్తు తెలియని శివపార్వతి మెడలో మూడు సవర్ల బంగారు గొలుసును లాక్కొని పారిపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బండారు సురేష్ బాబు తెలిపారు.

### మొక్కజొన్న పంట దగ్ధం



పెదకాకాని: మినప తుక్కుకు నిప్పు పెట్టడంతో మంటలు వ్యాపించి తొమ్మిది ఎకరాల మొక్కజొన్న పైరు దగ్ధమైన సంఘటన తక్కెళ్లపాడు శివార్లలో చోటు చేసుకుంది. ఉప్పలపాడు వెళ్లే రోడ్డు పక్కనే మినుము నూర్పిడి చేసిన తరువాత మిగిలిన తుక్కుకు గురువారం ఆ పొలం రైతు నిప్పు పెట్టాడు. అదే సమయంలో గాలులు వీయడం, మంటలు చెలరేగడంతో పక్కనే కోతకు సిద్ధంగా ఉన్న మొక్కజొన్న పంటకు నిప్పు అంటుకుంది. పైరు బాగా ఎండిపోయి ఉండటంతో మంటలు బాగా చెలరేగిపోయాయి. చుట్టుపక్కల రైతులు ఆ ప్రాంతానికి చేరుకుని ఆర్పే ప్రయత్నం చేశారు. వారి సమాచారం మేరకు గుంటూరు అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటల్ని పూర్తిగా అదుపులోకి తీసుకు వచ్చారు. అప్పటికే తొమ్మిది ఎకరాల పంట అగ్నికి ఆహుతైంది. సంఘటనా స్థలానికి పెదకాకాని రెవెన్యూ, పోలీసు అధికారులు, సిబ్బంది చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

### ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ కళాశాల విద్యార్థుల ప్రతిభ



స్వప్నశ్రీ



పూర్ణిమ

చేబ్రోలు: ఇంటర్ పరీక్షా ఫలితాల్లో చేబ్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ కె. సుచరిత గురువారం తెలిపారు. సీనియర్ ఇంటర్ బైపీసీలో ఎన్. స్వప్నశ్రీ (876), సీఈసీ విభాగంలో పి. పూర్ణిమ (799), పి. నవీన్‌బాబు ఎంపీసీలో (783), ఎస్. రమ్య హెచ్‌ఈసీలో (657) మార్కులు సాధించినట్లు పేర్కొన్నారు. జూనియర్ ఇంటర్ ఫలితాలలో ఎంపీసీలో ఎం. భవానీ ప్రసాద్‌కు 326, పి. అమూల్యకు బైపీసీలో 355 మార్కులు వచ్చినట్లు చెప్పారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

# మలినేని విద్యార్థులకు ఎల్ అండ్ టీలో ఉద్యోగాలు



విద్యార్థులతో ప్రిన్సిపాల్ అప్పారావు తదితరులు

పుల్లడిగుంట (ప్రత్తిపాడు): వట్టిచెరుకూరు మండల పరిధిలోని పుల్లడిగుంట మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో చివరి సంవత్సరం చదువుతున్న 22 మంది విద్యార్థినులు ఎల్ అండ్ టీ కంపెనీలో ఉద్యోగాలకు ఎంపికైనట్లు ఆ కళాశాల చైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏడాదికి నాలుగు లక్షల రూపాయల వార్షిక వేతనం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. నెల రోజులుగా మూడు దశల్లో ఇంటర్వ్యూలు నిర్వహించిన అనంతరం విద్యార్థినులను కంపెనీ ప్రతినిధులు ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు చెప్పారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థినుల్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జెట్టి అప్పారావు, డైరెక్టర్ డాక్టర్ డి. శ్రీనివాసకుమార్, డీన్స్ డాక్టర్ పోపూరి రమేష్‌బాబు, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్స్ హెడ్ డాక్టర్ కె. శ్వేత, ప్రొఫెసర్ జంపని కిశోర్‌బాబు అభినందించారు.

# జిల్లా ఫుట్‌బాల్ జట్టుకు ఉప్పలపాడు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులతో హెచ్‌ఎం నాగేశ్వరరావు, పీఈటీ వినయ్‌కుమార్

పెదకాకాని: గుంటూరు జిల్లా ఫుట్‌బాల్ జట్టుకు తమ విద్యార్థులు ఎంపికవ్వడం గర్వకారణమని ఉప్పలపాడు జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మైనేని నాగేశ్వరరావు తెలిపారు. పాఠశాలలో గురువారం విద్యార్థుల్ని అభినందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ పాఠశాల వ్యాయామోపాధ్యాయుడు చంద్ర వినయ్‌కుమార్ పర్యవేక్షణలో విద్యార్థులు ఫుట్‌బాల్ ఆటలో శిక్షణ పొందినట్లు చెప్పారు. గుంటూరులో జరిగిన జిల్లా ఫుట్‌బాల్ టీమ్‌కు 9వ తరగతి విద్యార్థినులు షేక్ తాహెరున్నీసా, షాలిని, రిబ్కా, మమత ఎంపికైనట్లు తెలిపారు. వీరంతా మే ఒకటి నుంచి ఐదో తేదీ వరకు ఐదు రోజుల పాటు తిరుపతిలో జరిగే రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంటులో పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. ఆ పోటీల్లోనూ ప్రతిభ కనపరచి రాణించాలని విద్యార్థుల్ని ఆశీర్వదించారు.

# సమాజానికి ఉపయోగపడేలా ఆవిష్కరణలు ఉండాలి




విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న కళాశాల యాజమాన్యం

వింజనంపాడు (ప్రత్తిపాడు): సమాజానికి ఉపయోగపడేలా విద్యార్థుల ఆవిష్కరణలు ఉండాలని కిట్స్ కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు తెలిపారు. వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులోని కేకేఆర్ అండ్ కేఎస్ఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్‌లో ఈ నెల 26, 27 తేదీల్లో సీఎస్ఈ తృతీయ సంవత్సరం విద్యార్థులకు ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐవోటీ)పై 36 గంటల హ్యాకథాన్ నిర్వహించారు. బూట్ క్యాంప్ ద్వారా అంతర్జాలానికి సంబంధించిన పలు సాంకేతిక విషయాల్ని నిపుణులు బోధించారు. సాంకేతికతను అందిపుచ్చుకుని సమా జానికి ఉపయోగపడే ఆవిష్కరణలను ఎలా అభివృద్ధి చేయాలనే అంశాలపై వివరించారు. విద్యార్థులు ఐవోటీ వినియోగించి నలభై ఆవిష్కరణలకు ప్రొటోటైప్‌ను డెవలప్ చేశారు. వివిధ సాఫ్ట్‌వేర్ కంపెనీలకు చెందిన ఆరుగురు సభ్యులతో కూడిన నిపుణుల జ్యూరీ, ఐదు ఉన్నత ఆవిష్కరణలను ఎంపిక చేసి మెమోంటోలు, సర్టిఫికెట్లు అందజేసింది. ఈ సందర్భంగా చైర్మన్ కోయి సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతికంగానూ రాణించాలని తెలిపారు. సుప్రజా టెక్నాలజీస్ ఫౌండర్ సీఈవో సంతోష్ చలువాది, ఐవోటి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అనలిస్ట్ షేక్ రబ్బాని బాషా, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. బాబు, అకడమిక్ డైరెక్టర్ హరిబాబు, సీఎస్ఈ విభాగాధిపతి ఆర్. రమేష్ పాల్గొన్నారు.

# ఇనుము లోడు లారీ బోల్తా



యనమదల (ప్రత్తిపాడు): ఇనుము లోడు లారీ డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన ప్రకారం.. పదహారవ నంబరు జాతీయ రహదారిపై బుధవారం రాత్రి గుంటూరు వైపు నుంచి వస్తున్న భారీ కంటైనర్‌ను డ్రైవర్ రాంగ్ రూట్‌లో హైవే నుంచి సర్వీస్ రోడ్డులోకి దించేందుకు ప్రయత్నించాడు. కంటైనర్ టర్న్ అవ్వకపోవడంతో ఒక్కసారిగా వెనక్కు రివర్స్ చేశాడు. దీంతో అదే సమయంలో గుంటూరు నుంచి వస్తున్న ఇనుము లోడు లారీ డ్రైవర్ కంటైనర్ ఉన్నపళంగా వెనక్కు రావడం గమనించి అప్రమత్తమయ్యాడు. ముందు ఉన్న కంటైనర్‌ను ఢీ కొడితే తన లారీలో ఉన్న క్లీనర్‌కు ప్రాణాపాయం ఉంటుందని భావించి, దాన్ని తప్పించి సైడ్ డివైడర్‌ను ఢీకొట్టాడు. దీంతో లారీ బోల్తా పడి, ఇనుము చెల్లాచెదురుగా రోడ్డుపై పడిపోయింది. ఈ ప్రమాదంలో ఎవ్వరికీ ప్రాణాపాయం జరగలేదు. అప్రమత్తమైన హైవే పెట్రోలింగ్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పారిపోతున్న కంటైనర్ డ్రైవర్, క్లీనర్లను అదుపులోకి తీసుకున్నారు. గురువారం సాయంత్రం వరకు ఘటనపై పోలీసులకు ఎలాంటి పిర్యాదు అందలేదు.

# వ్యవసాయ యంత్ర పరికరాలను సద్వినియోగం చేసుకోవాలి



గ్రూపు సభ్యులకు ట్రాక్టర్‌ను అందజేస్తున్న ఏఓ కిరణ్మయి, బ్యాంకు అధికారులు

కొండపాటూరు(కాకుమాను): ప్రభుత్వం రైతులకు అందిస్తున్న వ్యవసాయ యంత్ర పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని ఏఓ కె.కిరణ్మయి తెలిపారు. మండలంలోని కొండపాటూరులో శ్రీ పోలేరమ్మ తల్లి గ్రూపు సభ్యులకు గురువారం వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా ట్రాక్టర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ మండలంలోని రైతులు గ్రూపులుగా ఏర్పడి ప్రభుత్వం అందిస్తున్న యంత్ర పరికరాలను పొందాలని సూచించారు. గ్రూపు సభ్యులు పది శాతం చెల్లిస్తే 40 శాతం ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని, మిగిలిన 50 శాతం జీడీసీసీ బ్యాంకు రుణం మంజూరు చేస్తుందని వివరించారు. రైతులు యంత్ర పరికరాలను సద్వినియోగం చేసుకుని లబ్ధి పొందాలని ఆమె కోరారు. కార్యక్రమంలో జీడీసీసీ బ్యాంకు మేనేజర్ నాగబాబు, గ్రూపు సభ్యులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇద్దరు చైన్ స్నాచర్స్ అరెస్టు

బైక్, 82 గ్రాముల బంగారం స్వాధీనం



సమావేశంలో వివరాలు తెలుపుతున్న సీఐ శ్రీనివాసరావు

గుంటూరు రూరల్: ఒంటరిగా ప్రయాణిస్తున్న వ్యక్తులు, అర్ధరాత్రి ఒంటరి ప్రయాణికుల్ని బెదిరించి చోరీలకు పాల్పడిన సంఘటనలో నల్లపాడు పోలీస్ స్టేషన్ పోలీసులు ఇద్దరిని గురువారం అరెస్టు చేశారు. అడవితక్కెళ్లపాడులోని నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ శ్రీనివాసరావు మాట్లాడారు. అమరావతి రోడ్డులోని నగరాలు మునుస్వామినగర్‌కు చెందిన శ్రీరామినేని సుజా త ఈనెల 19న ఇంటి వద్ద ఒంటరిగా నడుస్తుండగా ఇద్దరు యువకులు ద్విచక్రవాహనంపై వచ్చి మెడలోని బంగారు గొలుసును అపహరించుకు పోయారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. జిల్లా ఎస్పీ కె. ఆరీఫ్‌హఫీజ్ పర్యవేక్షణలో దర్యాప్తు చేపట్టగా అరండల్‌పేట 16వ లైను 2వ అడ్డ రోడ్డుకు చెందిన రామమడుగు ప్రశాంత్, గోరంట్లకు చెందిన పత్తి దేవరాజును ఇన్నర్ రింగ్ రోడ్డు వద్ద అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. విచారణలో నిందితులు నేరాలను ఒప్పుకున్నారన్నారు. వారివద్ద నుంచి రూ. 4.5 లక్షల విలువైన 82 గ్రాముల బంగారు ఆభరణాలు, పల్సర్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. నిందితులపై నల్లపాడు, నగరంపాలెం, పట్టాభిపురం, తదితర పోలీస్ స్టేషన్లలో కేసులున్నాయని చెప్పారు. గతంలో చేసిన నేరాలకు జైలుకు వెళ్లి వచ్చారని, విడుదలై వచ్చినా ప్రవర్తన మార్చుకోలేదని తెలిపారు. నిందితుల్ని అదుపులోకి తీసుకునేందుకు కృషి చేసిన ఎస్ఐ అశోక్, పీసీలు సుబ్బారావు, షేక్ జాన్‌సైదా, పోతురాజు, కె. వెంకటనారాయణను సౌత్‌జోన్ డీఎస్పీ వై. జెస్సీ ప్రశాంతి అభినందించారని సీఐ చెప్పారు.

### బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి రిమాండ్

కాకుమాను: బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు ఎస్ఐ ఎస్.రవీంద్ర తెలిపారు. ఇటీవల మండలంలోని తెలగాయపాలెం పంచాయతీ పరిధిలోని లక్ష్మీపురంలో బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన ఎండేటి ప్రసాద్(62)ను గురువారం పాండ్రపాడు వద్ద అదుపులోకి తీసుకున్నట్లు ఆయన చెప్పారు. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి పొన్నూరు కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

### గాంధీ పార్కును ప్రారంభానికి సిద్ధం చేయండి

నెహ్రూనగర్: గాంధీ పార్కును త్వరలో ప్రారంభానికి సిద్ధం చేయాలని, పెండింగ్ పనుల్ని రెండు రోజుల్లో పూర్తి చేయాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లకు స్పష్టం చేశారు. ఆమె గురువారం పనుల్ని తనిఖీ చేసి, అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. షిఫ్ట్‌ల వారీగా కార్మికుల్ని నియమించుకొని పనుల్ని రెండు రోజుల్లో పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కి స్పష్టం చేశారు. పార్కు ప్రధాన కాంపౌండ్ వాల్‌పై అందమైన పెయింటింగ్‌లు వేయించాలని, పార్కింగ్ పనుల్ని కూడా వెంటనే చేయాలని ఇంజినీరింగ్ అధికారుల్ని ఆదేశించారు. పెద్ద చెట్లకు ట్రీ లైటింగ్ చేయాలని డీఈఈని ఆదేశించారు. పార్కు పరిసరాల్లో ఆక్రమణల్ని తొలగించాలని టీపీఎస్‌ను ఆదేశించారు. పనుల పురోగతి మేరకు కాంట్రాక్టర్‌కు బిల్స్ చెల్లించేందుకు నోట్ చేయాలని, పనుల్లో నాణ్యత లోపిస్తే సంబంధిత కాంట్రాక్టరే బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. పార్కులో గ్రీనరి పనులు వేగవంతం చేయాలని ఏడీహెచ్‌ని ఆదేశించారు. పర్యటనలో ఈఈలు కోటేశ్వరరావు, కొండారెడ్డి, డీఈఈలు శ్రీనివాసరెడ్డి, కల్యాణరావు, ఏడీహెచ్ రామారావు, ఏఈలు రాంబాబు, సునీల్ కుమార్, రవికిరణ్, టీపీఎస్ రసూల్ పాల్గొన్నారు.